క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(దర్గామిట్ట): కలెక్టర్ ఆనంద్‌ను ఏపీజేఏసీ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు మర్యాదపూర్వకంగా గురువారం కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. నేతలు అల్లంపాటి పెంచలరెడ్డి, డానియెల్ పీటర్, వేణు తదితరులు పాల్గొన్నారు.

జాలిరెడ్డికి పరామర్శ



నెల్లూరు(బృందావనం): వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కేశవరపు జాలిరెడ్డిని పార్టీ టీచర్స్ విభాగ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి గురువారం పరామర్శించారు. కందుకూరు నియోజకవర్గం కరేడులోని జాలిరెడ్డి నివాసానికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితి, యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని కాంక్షించారు.

స్వచ్ఛత హీ సేవ ర్యాలీ



నెల్లూరు(అర్బన్): వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం బాగుంటుందని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ఆర్థోపెడిక్ డాక్టర్ కొణతం భాస్కర్ పేర్కొన్నారు. స్వచ్ఛత హీ సేవ ర్యాలీని నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, రూడ్స్ ట్రస్ట్ సహకారంతో గురువారం నిర్వహించారు. వేదాయపాళెం, చైతన్యపురి కాలనీల్లో సుస్మిత నర్సింగ్ కళాశాల విద్యార్థినుల ఆధ్వర్యంలో ర్యాలీ సాగింది. నెహ్రూ యువ కేంద్ర యూత్ కో ఆర్డినేటర్ మహేంద్రరెడ్డి, పీహెచ్‌పీ గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, రూడ్స్ ట్రస్ట్ చైర్మన్ రసూల్, నేతలు శేషయ్య, దేవరకొండ శ్రీనివాసులు, విశ్రాంత ఏఎస్పై మహబూబ్‌బాషా, శంకరరావు, సుధాకర్‌సింగ్, నర్సింగ్ కళాశాల వార్డెన్ చాందిని తదితరులు పాల్గొన్నారు.

ర్యాంకర్‌కు సన్మానం



నెల్లూరు సిటీ: వీఆర్ లా కళాశాలలో ఎల్‌ఎల్‌బీ 2021 – 24కు గానూ 7.6 సీజీపీఏను కిసాన్‌నగర్ వాసి రవికుమార్ సాధించారు. ప్రథమ ర్యాంక్‌ను సాధించిన నేపథ్యంలో సీనియర్ అడ్వొకేట్ సత్యనారాయణ, నెల్లూరు హాస్పిటల్ డాక్టర్ రఫీక్, డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ గురువారం సత్కరించారు. న్యాయవాది మస్తానయ్య, సుధాకర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన నేతలు



నెల్లూరు(దర్గామిట్ట): కలెక్టర్ ఆనంద్‌ను నగరంలోని ఆయన చాంబర్‌లో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సూరిపాక ఉదయ్‌కృష్ణమాదిగ, ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు పందిటి అంబేడ్కర్ గురువారం కలిశారు. వినతిపత్రాన్ని అందజేసిన అనంతరం వారు మాట్లాడారు. ఆశ వర్కర్ విజయమ్మను కలిగిరి మండలం రావులకొల్లు పంచాయతీ సర్పంచ్ ఇబ్బందులకు గురిచేస్తున్నారని, దీనిపై చర్యలు చేపట్టాలని కోరారు. వివిధ సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. ఎంఈఎఫ్ రాష్ట్ర నేత వెంకటేశ్వర్లు, ఎమ్మెస్పీ నేత సిద్ధవరపు పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఈఈ బాధ్యతల స్వీకరణ



నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఎస్పీడీసీఎల్ జిల్లా కన్‌స్ట్రక్షన్స్ విభాగ ఈఈగా పరంధామయ్య బాధ్యతలను గురువారం స్వీకరించారు. నెల్లూరు టౌన్ ఈఈ శ్రీధర్ తదితరులు ఆయనకు శుభాకాంక్షలను తెలియజేశారు.

తెలుగు సాహిత్యంలో హాస్యంపై సమావేశం రేపు

నెల్లూరు(బృందావనం): తెలుగు సాహిత్యంలో హాస్యం అనే అంశంపై పురమందిర ప్రాంగణంలోని వర్ధమాన సమాజ హాల్లో సమావేశాన్ని శనివారం నిర్వహించనున్నారు. ఈ మేరకు చేతన సంగీత, సాహిత్య, సాంస్కృతిక వేదిక నిర్వాహకులు సుబ్రహ్మణ్యం, శేషగిరీశం గురువారం ఒక ప్రకటనను విడుదల చేశారు.

నిబంధనలను ఉల్లంఘించి నిర్మిస్తే చర్యలు



భవన కొలతలను పరిశీలిస్తున్న సూర్యతేజ

నెల్లూరు(బృందావనం): నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం నిర్దేశించిన అనుమతులు, నిబంధనలను ఉల్లఘించి చేపడుతున్న కట్టడాలను నిర్మాణ స్థాయిలోనే నిలిపేయాలని కమిషనర్ సూర్యతేజ పేర్కొన్నారు. పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా మాగుంట లేఅవుట్, ముత్యాలపాళెం తదితర ప్రాంతాల్లో గురువారం ఆయన పర్యటించారు. స్థానికంగా ఓ భవన నిర్మాణ అనుమతులను పరిశీలించారు. అనుమతుల మేరకు నిర్మాణ పనులు జరుగుతున్నాయాననే అంశాన్ని ఆరాతీసి, సిబ్బందితో కొలతలేయించారు. అనంతరం పట్టణ ప్రణాళిక విభాగాధికారులు, సచివాలయ వార్డు ప్లానింగ్ కార్యదర్శులతో మాట్లాడారు. అనుమతుల మేరకే నిర్మాణాలు జరిగేలా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. నిబంధనలను ఉల్లఘించిన వారి వివరాలను కార్యాలయంలో అందజేసి, నోటీసులను జారీ చేయాలని సూచించారు. ముత్యాలపాళెంలోని ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను పరిశీలించి తాగునీటి నాణ్యతను తనిఖీ చేశారు. మాగుంట లేఅవుట్లో కృష్ణపట్నం పోర్టు నిర్వహణలోని పార్కును సందర్శించి వసతులను పరిశీలించారు. పార్కు పరిసరాల్లో పారిశుద్ధ్య పనులను రోజూ చేపట్టాలని చెప్పారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



అంబాపురంలో..



గాంధీనగర్‌లో..

నెల్లూరు సిటీ: బాలింతలు, గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు యోగా చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ రూరల్ సూపర్‌వైజర్ స్వరూప పేర్కొన్నారు. పౌష్టికాహార మాసోత్సవాన్ని పురస్కరించుకొని అంబాపురంలోని అంగన్‌వాడీ కేంద్రంలో కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. శైలజ, దీపిక, నాగభూషణమ్మ, శాంతమ్మ, రాజేశ్వరి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

- గాంధీనగర్, జ్యోతినగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆహార నియమాలపై అవగాహన కల్పించారు. సుజాత, సరస్వతి, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

ఆదాలకు సత్కారం



నెల్లూరు సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడిగా నియమితులైన ఆదాల ప్రభాకర్‌రెడ్డికి పార్టీ నెల్లూరు రూరల్ ఇన్‌చార్జి ఆనం విజయకుమార్‌రెడ్డి అభినందనలను తెలియజేశారు. పుష్పగుచ్ఛాన్ని అందజేసి సత్కరించారు.

వైద్య విద్యార్థులకు అభినందన



నెల్లూరు(అర్బన్): నేషనల్ మెడికల్ కౌన్సిల్, ఐఏపీఎస్ఎం ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో సత్తా చాటిన నెల్లూరు ప్రభుత్వ ఏసీఎస్సార్ మెడికల్ కళాశాల విద్యార్థి రాజారిషిధర్‌రెడ్డిని కళాశాలలో గురువారం సత్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ గోవిందు మాట్లాడారు. ఫ్యామిలీలో అడాప్షన్ ప్రోగ్రామ్ అనుభవాలు అనే అంశంపై వ్యాసరచన పోటీలను ఆగస్టులో నిర్వహించారని వివరించారు. ఎనిమిది వేల మంది మెడికల్ విద్యార్థులు వ్యాసాలను సమర్పించగా, అందులో 89 ఎంపికయ్యాయని తెలిపారు. వీటిలో రాజారిషిధర్‌రెడ్డి సమర్పించిన వ్యాసం ఎంపికవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు. ఎన్టీఆర్ యూనివర్సిటీ ఏటా నిర్వహించే మెడికల్ స్టూడెంట్ రీసెర్చ్ స్కాలర్‌షిప్ పథకానికి నెల్లూరు ప్రభుత్వ మెడికల్ కళాశాలకు చెందిన వెంకటవర్ధన్, ధీరజ్, తేజస్వి, ఆయుష్యమిత్తల్ ఎంపికయ్యారని వివరించారు. డాక్టర్లు మస్తాన్‌బాషా, నరేంద్ర, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎరుకల కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయరూ..



నెల్లూరు(బృందావనం): ఎరుకల కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి వారి అభివృద్ధికి కూటమి ప్రభుత్వం సహకరించాలని ఎరుకల సేవా సంఘ జిల్లా అధ్యక్షుడు నల్లగొండ్ల శివ కోరారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో గురువారం ఆయన మాట్లాడారు. నేతలు కట్టా రమణయ్య, కట్టా రామారావు, బండి బుజ్జయ్య, నల్లగొండ్ల వెంకయ్య, సుబ్బరాయుడు, రమేష్, శ్యామ్, నాగేశ్వరరావు, రజని తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రితో భేటీ



నెల్లూరు(బారకాసు): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని డైకస్‌రోడ్డులోని ఆయన నివాసంలో ఎమ్మెల్సీ, పార్టీ సిటీ నియోజకవర్గ సమన్వయకర్త పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా గురువారం కలిశారు. పలు అంశాలపై వీరు చర్చించారు.

నిర్మల్‌కుమార్ నియామకం

నెల్లూరు(బృందావనం): సర్వోదయ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ టైటస్ నిర్మల్‌కుమార్‌ను నేషనల్ నింబల్ హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ అసిస్టెంట్ నేషనల్ మైనార్టీ రైట్స్ అఫైర్స్ చీఫ్‌గా నియమించారు. ఈ మేరకు ఫౌండేషన్ చైర్మన్ విజయమోహన్‌రావు, డైరెక్టర్ జనరల్ ఆఫ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ప్రవీణ్‌రావు ఉత్తర్వులను జారీ చేశారు.

క్రైమ్ కార్నర్

వృద్ధురాలి మెడలోని గొలుసు చోరీ

నెల్లూరు(క్రైమ్): బస్సెక్కుతున్న వృద్ధురాలి మెడలోని గొలుసును గుర్తుతెలియని దుండగుడు చోరీ చేసిన ఘటన ఆర్టీసీ ప్రధాన బస్టాండ్ ఆవరణలో గురువారం చోటుచేసుకుంది. వివరాలు.. ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన అమీనాబీ వెంకటగిరిలోని తన చెల్లెలి వద్దకు వెళ్లేందుకు ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చారు. బస్సెక్కే క్రమంలో ఆమె మెడలోని మూడు సవర్ల బంగారు గొలుసును గుర్తుతెలియని దుండగుడు చోరీ చేశారు. బస్సెక్కిన అనంతరం మెడలో గొలుసు లేకపోవడాన్ని గమనించిన ఆమె చుట్టుపక్కల గాలించారు. అయినా ప్రయోజనం లేకపోవడంతో చిన్నబజార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై అయ్యప్ప కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిపై దాడి

నెల్లూరు(క్రైమ్): స్థల వివాద నేపథ్యంలో వ్యక్తిపై దాడికి పాల్పడిన ఘటనలో నిందితుడిపై సంతపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. సంతపేట ప్రాంతానికి చెందిన సుబ్బారావు, దినేష్ వరుసకు బాబాయ్ అబ్బాయ్‌లు. స్థల వివాద నేపథ్యంలో సుబ్బారావుపై దినేష్ గురువారం దాడి చేసి గాయపర్చారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బంగారు నగల కాజేత

నెల్లూరు(క్రైమ్): ఫంక్షన్ ఉందని నగలు తీసుకెళ్లి కాజేసిన ఓ మహిళపై చిన్నబజార్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. కోటమిట్టలో నివాసం ఉంటున్న జరీనాకు నగరానికి చెందిన హరిత స్నేహితురాలు. ఫంక్షన్ ఉందంటూ స్నేహితురాలికి చెందిన జత గాజులు, బంగారు గొలుసును హరిత తీసుకున్నారు. అనంతరం ఆమెకు తిరిగివ్వలేదు. దీనిపై పలుమార్లు జరీనా ప్రశ్నించగా, కాలయాపన చేస్తూ వచ్చారు. చివరికి తన వద్ద లేవని.. ఎక్కువగా మాట్లాడితే ఎస్సీ, ఎస్టీ కేసు పెడుతామని బెదిరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్సై సుబ్రహ్మణ్యం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గాయపడిన మహిళ మృతి

నెల్లూరు(క్రైమ్): రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళ మృతిపై నార్త్ ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. చిల్లకూరు మండలం గుమ్మలదిబ్బకు చెందిన ఏడుకొండలు, పావని (41) దంపతులు అల్లూరు మండలం ఇస్కపల్లిలోని బంధువుల ఇంట్లో శుభకార్యానికి ఈ నెల 23న వెళ్లారు. తిరిగెళ్తుండగా, భగత్‌సింగ్ కాలనీ సమీపంలోకి వచ్చేసరికి బైక్ అదుపుతప్పడంతో ఇద్దరూ కిందపడ్డారు. ఘటనలో తీవ్రంగా గాయపడిన పావని జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందారు. ఏడుకొండలు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

జీతాల్లో వ్యత్యాసాలను సవరించాలి

నెల్లూరు(సెంట్రల్): రాష్ట్రంలో కొన్ని ప్రధాన శాఖల్లో పనిచేసే స్కిల్డ్, సెమీ స్కిల్డ్, అన్‌స్కిల్డ్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీతాల్లో చాలా వ్యత్యాసాలున్నాయని, వీటిని సవరించాలని ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు కోరారు. నెల్లూరులోని రైల్వే ఫీడర్స్ రోడ్డులో గల పశుసంవర్ధక శాఖ సమావేశ మందిరంలో కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏళ్ల తరబడి ప్రభుత్వ శాఖల్లో తక్కువ జీతానికి పనిచేస్తున్న వారికి సీనియార్టీ ప్రాతిపదికన ప్రోత్సాహకాలను అందించి ఆదుకోవాలని కోరారు. అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల కుటుంబాలకూ సంక్షేమ పథకాలను అందించాలని కోరారు.

కంప్యూటరీకరణ పనులు వేగవంతం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వ్యవసాయ సహకార పరపతి సంఘాల కంప్యూటరీకరణను వేగవంతం చేయాలని డీసీఓ గుర్రప్ప ఆదేశించారు. 46 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల సీఈఓలు, సిబ్బందికి నగరంలోని డీసీఓ కార్యాలయంలో గురువారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని పేడూరు, పడుగుపాడు సొసైటీల కంప్యూటరీకరణను పైలెట్ ప్రాజెక్ట్ కింద పూర్తి చేశామని, మిగిలిన వాటికి త్వరితగతిన పూర్తి చేస్తామని వెల్లడించారు. డీసీసీబీ ప్రాజెక్ట్ అభివృద్ధి మేనేజర్ ప్రదీప్‌కుమార్‌రెడ్డి, సహకారశాఖ ఆడిట్ అధికారి తిరుపతయ్య, ఆప్కాబ్ మేనేజర్ గురూజీ తదితరులు పాల్గొన్నారు.

కాకాణికి అభినందనల వెల్లువ



నెల్లూరు(బారకాసు): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి అభినందనలను తెలిపేందుకు పార్టీ శ్రేణులు పోటెత్తున్నారు. దీంతో డైకస్‌రోడ్డులోని ఆయన నివాసం వద్ద సందడి నెలకొంది. ఆయనకు శాలువా కప్పి పుష్పగుచ్ఛాలను అందజేసి తమ అభిమానాన్ని చూపుతున్నారు.

'నారాయణ' విద్యార్థి ఆత్మహత్యపై నివేదిక ఇవ్వండి

నెల్లూరు(క్రైమ్): నారాయణ విద్యార్థి జయధర్ ఆత్మహత్య ఘటనపై నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ (ఎన్సీపీసీఆర్) స్పందించింది. ఘటనకు దారితీసిన పరిస్థితులు, కేసు నమోదు, తదుపరి విచారణ తదితర అంశాలకు సంబంధించిన పూర్తి నివేదికను అందజేయాలని కలెక్టర్ ఆనంద్‌ను కమిషన్ సీనియర్ కన్సల్టెంట్ బలదేవ్‌రాజ్ కోరారు. ఈ క్రమంలో సమగ్ర నివేదికను అందజేయాలని ఎస్పీ, నెల్లూరు ఆర్డీఓ, డీఈఓ, ఐసీడీఎస్ పీడీని కలెక్టర్ ఆదేశించారు.

ఘటన పూర్వాపరాలు..

ఇస్కాన్‌సిటీకి చెందిన రామిశెట్టి కృష్ణమూర్తి, అపర్ణ దంపతుల కుమారుడు జయధర్ నెల్లూరులోని నారాయణ ఒలంపియాడ్ స్కూల్లో పదో తరగతి చదివేవారు. సక్రమంగా చదవడంలేదని, మంచి మార్కులొస్తున్నా రావట్లేదంటూ రోజూ ఏదో ఒక సాకుతో ఉపాధ్యాయులు తిట్టేవారు. ఈ క్రమంలో జూలై 16న అందరి ముందు జయధర్‌ను కొట్టడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఇంట్లో ఉరేసుకొని మరుసటి రోజున ఆత్మహత్యకు పాల్పడ్డారు. తమ కుమారుడి మృతికి నారాయణ యాజమాన్యం, ప్రిన్సిపల్, కెమిస్ట్రీ, మ్యాథ్స్, సోషల్ టీచర్లే కారణమంటూ పోలీసులకు తల్లిదండ్రులు అప్పట్లో ఫిర్యాదు చేశారు. నారాయణ విద్యాసంస్థలు మంత్రివి కావడంతో తమకు న్యాయం జరగదని భావించిన తల్లిదండ్రులు ఎన్సీపీసీఆర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన కమిషన్ ఘటనపై నివేదికను అందజేయాలని కలెక్టర్‌ను కోరింది.

మూఢ నమ్మకాలను వీడాలి



నెల్లూరు(అర్బన్): కొన్ని రకాల వ్యాధులపై ప్రజలు మూఢ నమ్మకాలను వీడాలని ప్రభుత్వ పెద్దాస్పత్రి అసోసియేట్ ప్రొఫెసర్ కాలేషాబాషా పేర్కొన్నారు. చింతారెడ్డిపాళెంలోని యలమవారిదిన్నెలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ఎన్నెస్సెస్ టీమ్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. వీధుల్లో ఉన్న ముళ్ల చెట్లను తొలగించి కాలువల వద్ద బ్లీచింగ్ చల్లారు. అనంతరం అర్బన్ హెల్త్ సెంటర్‌లో అవగాహన సదస్సును నిర్వహించారు. స్వచ్ఛంద రక్తదానంపై రెడ్‌క్రాస్ సొసైటీకి చెందిన భాస్కర్‌రావు వివరించారు. నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ కామేశ్వరి, ఎన్నెస్సెస్ ప్రాజెక్ట్ ఆఫీసర్ ప్రసూనకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఎన్జీఓ నేత విగ్రహావిష్కరణ నేడు

నెల్లూరు(దర్గామిట్ట): భక్తవత్సలనగర్‌లో రెవెన్యూ భవన్‌కు కేటాయించిన స్థలంలో తోట సుధాకర్ ప్రసాద్ కాంస్య విగ్రహాన్ని శుక్రవారం ఆవిష్కరించనున్నామని ఏపీ జేఏసీ అధ్యక్ష కార్యదర్శులు అల్లంపాటి పెంచలరెడ్డి, డానియల్ పీటర్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సంఘ అధ్యక్షుడు, ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సుధాకర్ ప్రసాద్ సతీమణి కామాక్షి, వారి కుటుంబసభ్యుల చేతుల మీదుగా కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని వివరించారు.

ప్రజా సమస్యలపై స్పందించాలి



కార్పొరేటర్లతో సమావేశమైన చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు(బృందావనం): నగరంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు వారి డివిజన్లలో ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ.. వారి సమస్యలపై స్పందిస్తూ.. కార్యకర్తలకు ఎలాంటి కష్టమొచ్చినా పార్టీ అండగా ఉంటుందనే భరోసా కల్పించాలని పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. చిల్డ్రన్స్ పార్క్ రోడ్డు సమీపంలోని తన కార్యాలయంలో ఆయనతో కార్పొరేటర్లు గురువారం భేటీ అయ్యారు. ప్రజా సమస్యలపై పోరాటాలు సాగిస్తే పార్టీ మరోసారి అధికారంలోకి రావడం ఖాయమని చెప్పారు. కార్పొరేటర్లు వేలూరు మహేష్, ఊటుకూరు నాగార్జున, కరిముల్లా, కామాక్షిదేవి, గుంజి జయలక్ష్మి, పార్టీ 45వ డివిజన్ ఇన్‌చార్జి ముదిరెడ్డి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభినందనలు

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో 11, 42వ డివిజన్లకు చెందిన పార్టీ నేతలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సత్కరించారు.

నెల్లూరు(బారకాసు): ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని రామ్‌జీనగర్‌లోని ఆయన కార్యాలయంలో 16వ డివిజన్‌కు చెందిన పార్టీ నేతలు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలను తెలియజేశారు. శాలువా కప్పి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. పార్టీ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఖలీల్ అహ్మద్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు హంజాహుస్సేనీ, 45వ డివిజన్ ఇన్‌చార్జి నేతాజీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చేస్తే చర్యలు



స్కానింగ్ కేంద్రంలో తనిఖీ

నెల్లూరు(అర్బన్): జిల్లాలోని స్కానింగ్ కేంద్రాల్లో లింగ నిర్ధారణ చేశారని తెలిస్తే వారిపై పీసీ, పీఎన్డీటీ చట్టం మేరకు కేసులు నమోదు చేస్తామని ఏడీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ స్పష్టం చేశారు. నగరంలోని కేఎం, ఇమేజ్, మాగ్నెంట్ స్కాన్ సెంటర్లు, రిచ్, రత్నసాయి ఆస్పత్రుల్లో ఆకస్మిక తనిఖీలను వైద్యశాఖ మాస్ మీడియా అధికారి కనకరత్నంతో కలిసి గురువారం చేపట్టారు. రికార్డులను పరిశీలించారు. గర్భిణులకు నిర్వహిస్తున్న స్కానింగ్ వివరాలను ఆన్‌లైన్లో నమోదు చేయాలని ఆదేశించారు. ధరల పట్టికను స్కానింగ్ కేంద్రాల వద్ద ప్రదర్శించాలని కోరారు. క్షయ విభాగ జిల్లా కో ఆర్డినేటర్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ బ్రాంచ్‌లో మహాజన సభ



మొక్కలు నాటుతున్న గుర్రప్ప

నెల్లూరు(వీఆర్సీసెంటర్): సహకార ఉద్యోగుల వినియోగదారుల సంఘం అభివృద్ధి పథంలో పయనిస్తోందని డీసీఓ గుర్రప్ప పేర్కొన్నారు. రామ్మూర్తినగర్‌లోని డీసీసీబీ బ్రాంచ్ కార్యాలయ ఆవరణలో గురువారం నిర్వహించిన మహాజన సభలో ఆయన మాట్లాడారు. సహకార సూత్రాలను అనుసరించి వినియోగదారులకు మంచి సేవలను అందిస్తోందని వివరించారు. అనంతరం మొక్కలు నాటారు. సంఘ అధ్యక్షుడు మునిప్రసాద్, జిల్లా సహకారశాఖ ఆడిట్ అధికారి తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

29న కుమ్మర సంఘీయుల సమావేశం



మాట్లాడుతున్న నేతలు

నెల్లూరు(బృందావనం): అంబాపురం సమీపంలో నిర్మించిన కమ్యూనిటీ హాల్ అభివృద్ధికి చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించేందుకు గానూ కుమ్మర సంఘీయుల ఆత్మీయ సమావేశాన్ని ఆదివారం ఉదయం 9.30కు నిర్వహించనున్నామని ఏపీకేఎస్సెస్సెస్ జిల్లా నేతలు తెలిపారు. ఈ మేరకు ప్రెస్‌క్లబ్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో నేతలు సుమన్ ప్రజాపతి, శ్రీరాములు మాట్లాడారు. ఉన్నతాశయాలతో కొందరు సభ్యులతో కూడిన కమిటీకి కమ్యూనిటీ హాల్‌ను పదేళ్ల క్రితం అప్పగించామని, అయితే ఆశించిన మేర అభివృద్ధి జరగలేదని చెప్పారు. కమ్యూనిటీ హాల్ అభివృద్ధి, నూతన కార్యవర్గ ఏర్పాటుకు సంబంధించిన సమావేశాన్ని నిర్వహించనున్నామని వివరించారు. సమావేశానికి హాజరుకావాలని కోరారు.

హెచ్‌పీఓలో న్యాయ విజ్ఞాన సదస్సు



మాట్లాడుతున్న వాణి

నెల్లూరు(అర్బన్): న్యాయసేవాధికార సంస్థల చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వాణి పేర్కొన్నారు. ఆచారి వీధిలోని హెడ్ పోస్టాఫీస్‌లో గురువారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. ఉచిత న్యాయసాయం కోసం జిల్లా న్యాయసేవాధికార సంస్థను సంప్రదించాలని కోరారు. హెడ్ పోస్ట్ మాస్టర్ అనిల్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కళానీరాజనం



నెల్లూరు(బృందావనం): నగరంలోని పురమందిరంలో కళానీరాజనాన్ని కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు కేతా సుబ్బారావు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా అరిగెపూడి కృష్ణకుమారి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన పాటలు, నృత్య పోటీల్లో ప్రతిభ చూపిన వారికి బహుమతులను అందజేశారు. సమాజసేవకుడు పోలేపల్లి శ్రీనివాసులును సత్కరించి సేవాభూషణ అవార్డును ప్రదానం చేశారు. సిద్ధేంద్రయోగి కూచిపూడి కళాక్షేత్ర నిర్వాహకుడు డేగల సాంబశివరావు శిష్యబృందం ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యాలు అలరించాయి. సంగీత విభావరి ఆకట్టుకుంది. వాకాటి విజయకుమార్‌రెడ్డి, నలుబోలు బలరామయ్యనాయుడు, పేరూరి ప్రదీప్, రియాజ్‌బాషా పాల్గొన్నారు.

ఘన నివాళి



నివాళులర్పిస్తున్న గొట్టిపాటి రవికుమార్

నెల్లూరు సిటీ: నగరంలోని సరస్వతీనగర్‌లో గల నివాసంలో మాగుంట పార్వతమ్మ పార్థివదేహానికి మంత్రి గొట్టిపాటి రవికుమార్ గురువారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రకాశం జిల్లా అభివృద్ధిలో మాగుంట కుటుంబ పాత్ర కీలకమని కొనియాడారు.

నెల్లూరు సిటీ: మాగుంట పార్వతమ్మ మరణం తననెంతో కలిచివేసిందని తెలుగు ఫిల్మ్ ప్రొడ్యూసర్ కౌన్సిల్ ఆఫ్ ఏపీ అధ్యక్షుడు, తమిళనాడు తెలుగు యువశక్తి వ్యవస్థాపక అధ్యక్షుడు కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి పేర్కొన్నారు. పార్వతమ్మ పార్థివదేహానికి నివాళులర్పించారు.

నెల్లూరు(వీఆర్సీసెంటర్): మాగుంట పార్వతమ్మ మృతి తీరని లోటు అని డీసీసీ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. సరస్వతీనగర్‌లోని నివాసంలో పార్వతమ్మ పార్థివదేహానికి నివాళులర్పించారు.